# రమణ భాస్కర

## (పాండువ్వలో శ్రీనాన్న గారి ప్రవచనము, 4-2-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మనం జీవస్థితిలో ఉన్నాము, జీవస్థితిలో ఉన్న మనం ఆత్మస్థితిలో ప్రవేశించాలి. ఏ గ్రామంలో ఉన్నా, ఏకులంలో పుట్టిన, ఏ దేవుని ఆరాధించినా జీవస్థితిలో ఉన్న మనం ఆత్మస్థితిని పొందాలి. జీవస్థితిలో ఉన్నంతకాలం మన శరీరాలు చనిపోయిన వెంటనే భయంకరమైన కటిక చీకటి లోనికి వెళతాము. ఆ చీకటి మీకు అనుభవానికి వచ్చినపుడు తెలుస్తుంది. ఈ శరీరం నిజం, ఈలోకం నిజం అని మనకు అనిపిస్తుంది. మన ఆరోగ్యం బాగా ఉన్నంత కాలం ఇలా చాలాకాలం జీవిస్తాము అని మనకు అనిపిస్తుంది. అదే మాయ. మహాత్ముల ప్రవచనాలు వినటం, యజ్ఞాలు, యాగాలు, తపస్సులు చేయటం వీటి అన్నింటియొక్క ప్రయోజనం ఏమిటి అంటే జీవస్థితిలో ఉన్నమనం అందులోనుండి విడుదల పొంది ఆత్మస్థితిని పొందటం. వీటి అన్నింటియొక్క లక్ష్యం అదే. ఇప్పుడు మనకు జీవుడే నేనుగా వ్యక్తమవుతున్నాడు. మీకు ఏదైనా కష్టంవచ్చినా, నష్టంవచ్చినా, సుఖంవచ్చినా, దుఃఖంవచ్చినా కంగారు పడకండి. ఇవి అన్నీ నేను మీదే ఆధారపడిఉన్నాయి. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములే, పారమార్థిక సత్యములుకావు. శరీరం ఏదోరోజు మరణిస్తుంది. శరీరం మరణించక ముందే ఏవో పాఠాలు కొన్ని నేర్చుకొని ఉంటే మన జన్మవృథా అవ్వదు. పుట్టి సాధన చెయ్యకుండా, విద్య సంపాదించకుండా చనిపోయేబదులు అసలు పుట్టకుండా ఉంటే మంచిది అని ఒక ఆంగ్ల రచయిత చెప్పాడు. విద్యలేకపోతే, సాధన లేకపోతే చెట్లకు, రాళ్ళకు మనకు తేడా ఏమీ ఉండదు.

ప్రారబ్ధం ప్రకారం దేహయాత్ర సాగుతూఉంటుంది. దేహం ఈ భూమిమీదకు ఎందుకు వచ్చిందో ఆ ప్రారబ్ధం ననుసరించి ఈశ్వరుడు ఆదేహమును త్రిప్పుతూ ఉంటాడు. ఇంటిదగ్గర పని శ్రద్ధగా చేసుకోండి. పనిమానివేస్తే జ్ఞానం వస్తుంది అని ఎవరూ అనుకోవద్దు. పనిమానివేస్తే దారిద్ర్యం వస్తుంది, సోమరితనం వస్తుంది. బాధ్యతలు విడిచిపెట్టి కూర్చొన్నవారు యోగులు అవ్వరు. మీరు ఏ బాధ్యతలు అయితే విడిచి పెట్టారో, ఏ పనిని అయితే విడిచి పెట్టారో రాబోయేజన్మలో వాటిని మీచేత చేయిస్తాడు. అందువలన మీ ప్రారబ్ధంలో ఏపని ఉందో దానిని చిరాకుగా చేయవద్దు, అయిష్టంగా చేయవద్దు. ప్రేమగా, హితవుగా చేయండి. పనిని విడిచిపెట్టవద్దు, సంకల్పమును ఊహించవద్దు అని గీతలో చెప్పాడు. సంకల్పమును విడిచిపెడితే మీరు ఊహించలేనంత శాంతి, ఆనందము మీకు వస్తుంది. హృదయపూర్వకంగా పనిచేయాలి. ఆపని వలన వచ్చే ఫలితం గురించి ఊహించటం మానివేయటమే సంకల్పమును విడిచిపెట్టటం. అలా చేస్తే మీరు జ్ఞానులు అవుతారు, యోగులు అవుతారు, సన్యాసులు అవుతారు. కృష్ణుడు చెప్పే విశేషం ఏమిటి అంటే మీరు ఏపని చేస్తున్నారో ఆపనిని మానక్కరలేదు. చేసేపనినే హృదయ పూర్వకంగా చేస్తే ఫలితాన్ని ఆశించకుండా చేస్తే వాడు ఏపని అయితే చేస్తున్నాడో ఆపని ద్వారానే యోగి అవ్వవచ్చు. మన హృదయంలో శాంతిలేదు, నిర్మలత్వంలేదు, సమానంగా లేము. మన హృదయంలో సమానత్వం ఉంటే, శాంతిగా ఉంటే హృదయంలో ఉన్న సమానత్వం, శాంతి కుటుంబానికి వస్తుంది, గ్రామానికి వస్తుంది,

దేశానికి వస్తుంది. హృదయంలో లేనిది ఎలా వస్తుంది. సమానత్వం, సమానత్వం అని నోటితో చెపితే ఎక్కడ నుండి వస్తుంది. మనం హృదయాన్ని వదిలి వేస్తున్నాము, బాహ్యమైన గౌరవాలకోసం, గొప్పలకోసం నటిస్తున్నాము. మనం అందరము నటులము. హృదయంలో లేనిది నటిస్తున్నాము. అది ఎంత కాలం నిలబడుతుంది. దేశంగాని, గ్రామంగాని, కుటుంబంగాని శాంతిగా, సుఖంగా ఉండాలంటే నీ హృదయంలో శాంతి, సుఖం ఉండాలి. నీలోపల లేనిది బయట ఎక్కడ కనబడదు. ఏదో రోజు శరీరం మరణిస్తుంది. నీకు జీవలక్షణాలు ఉంటే కటికచీకటిలోనికి వెళ్ళవలసిందే. అందుచేత శరీరం ఉండగానే సాధన చేసి, పరమేశ్వరుని ఆశ్రయించి చీకటిలో ప్రయాణం చేయకుండా వెలుగు మార్గమును చూసుకోండి అని చెపుతున్నారు. కర్మఫలాన్ని ఊహించకుండా ఉంటే మనస్సు సంస్కరింపబడుతుంది. సభ్యత, సంస్కారం వస్తుంది. వీటితో పాటు మోక్షం వస్తుంది.

పిల్లవాడు బొమ్మలతో ఆడుకొన్నంత సేపు తల్లి బిడ్డ దగ్గరకు రాదు. బొమ్మలగొడవ వదిలేసి తల్లి కోసం ఏడ్చినపుడు తల్లి వచ్చి బిడ్డను ఎత్తుకొంటుంది. మనం నామ, రూపముల గొడవలో ఉన్నాము, మనకు ఇంకా దేవుని గురించి ఏడుపు రాలేదు. మనం ఈలోకం గొడవలలో ఉన్నంతసేపు, నామరూపముల గొడవలో ఉన్నంత సేపు దేవుడు మనవంక చూడడు. వారిగొడవలో వారు ఉన్నారు మనకు ఎందుకు అనుకొంటాడు. లోకం మీద ఉన్న సరదాపోయినపుడు మాత్రమే దేవుడు మనలను ఆలింగనము చేసుకొంటాడు. ధ్యానం మనలోపల సహజంగా జరుగుతూ ఉంటుంది. కొంచం అటుచూస్తే చాలు అది నీకు తెలుస్తుంది. దానిని గుర్తించటానికి యోగ్యత ఉండాలి. మొట్టమొదటి జన్మ ఎప్పుడు వచ్చిందో, ఏ యుగంలో వచ్చిందో ఎలాగైతేనే మనం భగవంతునిలో నుండి విడిపోయాము. ఈ ప్రసంగాల ద్వారా, పూజల ద్వారా, జపాలద్వారా, ధ్యానాలద్వారా మనం ఎక్కడనుండి అయితే విడిపోయామో మరల ఆ దేవునిలో ఐక్యమవ్వటమే మన జీవిత లక్ష్యం. సుఖస్వరూపం, ఆనంద స్వరూపం, చైతన్యస్వరూపం అయినటువంటి పరమేశ్వరుడిలో నుండి మనం విడిపోయాము. ఏదో సాధన చేసి మరల ఆయనలో ఐక్యమవ్వటానికి మనం ప్రయాణం చేస్తున్నాము. భగవంతునిలో ఐక్యమయ్యే వరకూ దేహాలు వస్తూనే ఉంటాయి. ఈ దేహానికి ముగింపు ఉందిగాని నీయాత్రకు ముగింపులేదు. దేవునిలో ఐక్యమయ్యేవరకూ మనయాత్రకు ముగింపులేదు. దేహం మారినంత మాత్రంచేత నీయాత్రకు ముగింపులేదు. నీగమ్యం చేరేవరకూ నీ యాత్రకు ముగింపులేదు.

కాశీ, రామేశ్వరం వెళ్ళినంత మాత్రంచేత నీకు జ్ఞానం కలుగదు. ఎక్కడకు వెళ్ళినా దేనిని జయించాలి, దేనిని నిగ్రహించుకోవాలి అది చూసుకోవాలి. నీ దేహం ఎక్కడ ఉన్నా మనస్సును జయించాలి. దేహంతోటి నీకు సంబంధంలేదు. ఈ దేహంనాది అని నీలోపల ఉండి ఏజీవుడు అయితే చెపుతున్నాడో ఆ జీవుడికి ఉండే స్వభావాన్ని, లక్షణాలను మార్చుకొంటే కాని నీకు జ్ఞానం కలుగదు. అన్నం లేకుండా దేహం ఉండలేదు. లోపల ఉన్న జీవుడు శరీరం లేకుండా ఉండలేడు. అందువలన శరీరం పోయినపుడు వాడికి కొత్త శరీరం వస్తుంది. జీవలక్షణాలు పోయినపుడు వాడికి శరీరంతో పని ఉండదు. పూర్వజన్మలలో మనం చేసిన పనులను బట్టి ఏర్పడిన వాసనలకు అనుగుణంగా మనం పుడతాము. వాటిని నెరవేర్చుకోవటానికి ఈదేహంలో పనిచేస్తాము. ఎందుకు పుట్టాము అని తెలుసుకోవటానికి నువ్వు ధ్యానం చేయనక్కరలేదు. నీకు ఉన్నవాసనలను నశింపచేసుకొని, భగవంతునిలో ఐక్యమవ్వటానికి నీవు ధ్యానం చెయ్యాలి. ఎవడికి ఏకోరిక ఉందో ఆ కోరిక నెరవేర్చుకోవటానికి వాడుపుడతాడు. ఆకోరిక నెరవేరిపోతే ఎంతోసుఖంగా, శాంతిగా ఉంటాను అని జీవుడు అనుకొంటాడు. కోరిక నెరవేరినతరువాత ఆ ఫలాన్ని అనుభవించాక ఇందులో

ఏమిలేదన్న సంగతివాడికి తెలుస్తుంది. ఇలా కోటిజన్మలు వెళ్ళిపోతాయి. ఇదే మాయ. ప్రపంచంలో ఏవస్తువులోను, ఏ విషయంలోను సుఖంలేదు అన్నసంగతి ముందునీకు అర్థమవ్వాలి. సుఖము, శాంతి ఒక్క భగవంతుడిలోనే ఉన్నాయి. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. దేవునితెలుసుకొంటే దేహంఉన్నా, పోయినా నీవు ఉంటావు. దేహం పోయిన తరువాత కూడా నేను ఉంటాను అన్నసంగతి తెలిస్తే ఆ స్థితిని సంపాదిస్తే వాడే దేవుడు. ఉండటం అనేది నీకు తెలిస్తే నీ వెనకాల సుఖం, శాంతి, ఆనందం వాటి అంతట అవే వచ్చేస్తాయి. ధ్యానం చేయాలి అనుకొన్నా వాసన నీమనస్సును బయటకు లాగేస్తుంది. వాసన యొక్క వేగం మిమ్మల్ని ధ్యానం చేయనివ్వదు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా ఒక చిన్నవాసనలో నుండి కూడా జీవుడు బయటకు రాలేడు. వాసనకు ఎంతవేగం ఉందో, ఎంతశక్తిఉందో ఏదో జన్మలో ఆశక్తిని నీకు చూపించకుండా వాసనబయటకుపోదు. ఆ వాసనతో పోరాడేటప్పుడు నీకు గురువు అనుగ్రహం లేకపోతే నువ్వు వాసన చేతిలో ఓడిపోతావు.

చలంగారు భగవాన్‌తో అనేవారు నేను వాసనలనే సంకెళ్ళ మధ్యలో ఉన్నాను. ఈ సంకెళ్ళలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాను కాని అందులో నుండి బయటకు రాలేనన్న సంగతినాకు తెలుస్తోంది. ఈ వాసనలనే సంకెళ్ళను నువ్వే నరకాలి, నన్ను విడిపించాలి. దీనికి కేవలం నాప్రయత్నం సరిపోదు అని అంటూ ఉండేవారు. జ్ఞాని యొక్క ఒక్క చూపు చాలు ఈ వాసనలు నశించటానికి. ఆచూపులో ఎంత మహత్తరప్రేమ ఉందో, ఎంతమహత్తర శక్తి ఉందో ఆశక్తి నీలోపల ఉన్న వాసనను మంటపెడుతుంది. చీకటిగా ఉంటే చీకటిని చూసి తిట్టుకొంటూకూర్చోవద్దు. దీపం వెలిగించుకోండి చీకటి పోతుంది. నీలోపల ఉన్న పరమేశ్వరుడు నీకు తెలియకుండా ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తిట్టుకొంటూ కూర్చోవద్దు. ఆబలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎప్పుడయితే ప్రయత్నం మొదలు పెడతావో ఈశ్వరానుగ్రహం దాని వెనకాలేవస్తుంది. ఆబలహీనతలనుండి బయటపడతావు. మనస్సును రెచ్చగొట్టవద్దు. మనస్సుతో స్నేహంచేసి ఆవాసనలనుండి మనస్సును విడిపించుకోవాలి. ఏ వాసనలు అయితే నీ మనస్సును బాహ్యంగా ఈడ్చుకొని పోతున్నాయో వాటిలో నుండి బయటపడటానికి పూజచేయాలి, జపంచేయాలి, ధ్యానంచేయాలి. ఓ పరమేశ్వరుడా!ఎన్నోయుగాల నుండి ఈవాసన నన్ను బాధపెడుతోంది, ఇందులో నుండి నన్ను విడుదల చేయాలి అని ప్రార్థిస్తూ ఉంటే భగవంతుడు నీ ప్రార్థనకు కరిగి నిన్ను వాసనలోనుండి విడుదల చేస్తాడు.

నువ్వు ఏది మానివేసిన యజ్ఞ, దాన, తపస్సులను నీశరీరం స్మశానమునకు వెళ్ళేవరకూ మానవద్దు అని కృష్ణుడు చెప్పాడు. నీవు చెయ్యగలిగినంత వరకూ ఇతరులకు సహాయం చెయ్యి. అది యజ్ఞం. నీకు కలిగిఉన్న దానిలో తోటివాడికి పెట్టు, అది దానం. నీ స్వభావం మార్చుకోవటానికి చనిపోయేవరకూ ప్రయత్నం చేయటం మానకు అది తపస్సు. నీ చివరి శ్వాసవరకు ఈ మూడింటిని వదలకు అని కృష్ణుడు చెప్పాడు.

★

శ్రీనాన్నగారి ప్రవచనములు మార్చి 22, 23వ తేదీలలో చించినాడ

27వ తేదీ బల్లిపాడు, 30వ తేదీ జిన్నూరు

Ratna Printing Works , Palakol © 22946